క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెండింగ్ పనులపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహించరాదన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి సకాలంలో పరిష్కరించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా అభివృద్ధి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఈఓఆర్డీ సులోచన తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హత్యపై నిరసన



నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

సి.బెళగల్: విశాఖ జిల్లాలో తహసీల్దార్ రమణయ్య హత్యపై మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు శనివారం నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మౌనం పాటించి మృతికి సంతాపం తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు శేఖర్, తిరుపాల్, లింగేష్, సోమేష్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఓర్వకల్లు: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు షూటింగ్ బాల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన 42వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుపై ఏపీ జట్టు విజయం సాధించినట్లు పేర్కొన్నారు. అండర్–19 విభాగంలో జరిగిన పోటీల్లో ఏపీ జట్టు తరుపున కాల్వబుగ్గలోని కాకతీయ స్కూల్ విద్యార్థులు అభిలాష్ (కెప్టెన్), నరేష్, సాయిచరణ్‌నాయక్ ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు దేవిక, సూర్యతేజ, హెచ్‌ఎం మనోహర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామానికి చెందిన ఆవుల బాలహుసేని క్యాన్సర్‌తో బాధపడుతూ కొద్ది రోజుల నుంచి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గడిగరేవుల సచివాలయం వలంటీర్ వెంకటసుబ్బయ్య శనివారం కర్నూలు వెళ్లి వేలిముద్రలు వేయించుకుని పింఛన్ నగదు అందించాడు. అత్యవసర పరిస్థితుల్లో పింఛన్ సొమ్ము తనకు అండగా నిలిచిందని బాలహుసేని సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్‌ను సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్ అభినందించారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.398 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఏపీటీడీసీ యూనిట్లకు నూతన మేనేజర్లు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హరిత హోటల్స్, రెస్టారెంట్ యూనిట్లకు నూతన మేనేజర్లు నియమితులైనట్లు ఏపీటీడీసీ కర్నూలు డివిజినల్ మేనేజర్ చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కర్నూలు పున్నమి హరిత హోటల్స్ యూనిట్ మేనేజర్‌గా కృష్ణా జిల్లాకు చెందిన బొంత సతీష్, ఓర్వకల్ యూనిట్ మేనేజర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన జీవన్ నియమితులయ్యారని పేర్కొన్నారు. వీరు బాధ్యతలు కూడా స్వీకరించారని తెలిపారు.

బాల మందిరాలు

- ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు
- చిన్నారులకు అర్థమయ్యేలా పాఠాలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్రాల అభివృద్ధి
- పిల్లకు పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం



పిల్లలను ఆటలాడిస్తున్న అంగన్‌వాడీ టీచర్,



గడివేముల కేంద్రంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

గడివేముల: అంగన్‌వాడీ కేంద్రాలు బాల మందిరాలుగా మారాయి. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయి. తల్లిలా ఆడిస్తూ వారికి విద్యాబుద్ధులు నేర్పుతున్నాయి. పౌష్టికాహారం అందించి పిల్లలకు ఆరోగ్యానికి తోడ్పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతిగా తీర్చిదిద్దారు. నూతన భవనాలు నిర్మించి వాటి రూపరేఖలను మార్చివేశారు. పిల్లలకు ఉత్సాహంగా ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు రావడానికి, తల్లిదండ్రులు పిల్లలను పంపడానికి ఆసక్తి చూపుతున్నారు.

సృజనాత్మక విద్య

ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ సృజనాత్మకతను జోడించి విద్యను నేర్పిస్తున్నారు. చిన్నచిన్న ఇంగ్లిష్ పదాలు, డ్రాయింగ్ వంటివి నేర్పిస్తున్నారు.

గడివేముల మండలంలో..
అంగన్‌వాడీ కేంద్రాలు– 49, అంగన్‌వాడీ టీచర్లు– 48
సహాయకులు–48, చిన్నారులు– 895

ప్రైవేట్ పాఠశాల్లో చదువుకునే పిల్లలు సైతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరడానికి వస్తున్నారు. ప్రీ ప్రైమరీ విద్య నాణ్యంగా అందితే ఆ బిడ్డ భవిష్యత్ అంత ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యపై ప్రత్యేక దష్టిసారించింది. దీంట్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా రూపుదిద్దుకున్నాయి. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలన్నీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించడానికే పరిమితమయ్యేవి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రీ ప్రైమరీ స్కూల్స్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

ఆకట్టుకునేలా బోధన

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఇప్పటికే ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్పు చేసింది. చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వారిలో అవగాహన పెంపొందించే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సిలబస్‌ను రూపొందించారు. చిన్నారుల అవసరమైన కిట్లను ప్రభుత్వం సమకూర్చడంతో పాటు ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చిన్నారులకు ఇంగ్లిష్ బోధించేందుకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ నూతన విధానంలో చిన్నారులకు ఇంగ్లిష్, మ్యాథ్స్, వర్క్‌బుక్, యాక్టివిటీ పుస్తకాలను అందించారు. చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలతో పుస్తకాలను తయారు చేశారు. వివిధ రకాల బొమ్మలు, ఆట పాటలతో బోధన సాగుతోంది. గణిత వర్క్ బుక్‌లో ఒకటి నుంచి పదెంకల వరకూ పరిచయం, యాక్టివిటీ బుక్‌లో బొమ్మలు గీయడం, బొమ్మలకు రంగులు వేయడం వంటి అంశాలు

రెండు తరగతులుగా విద్యాబోధన



అంగన్‌వాడీ ప్రీప్రైమరీ స్కూల్స్‌లో విద్యార్థులను వయసు ఆధారంగా రెండు తరగతులుగా విభజిస్తున్నాం. ప్రీ ప్రైమరీ–1లో మూడేళ్లు నిండిన చిన్నారులు ఉంటారు. ప్రీ ప్రైమరీ–2 నాలుగేళ్లు నిండిన పిల్లలు ఉంటారు. ఆ వయసు పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆట, పాటలతో విద్యాబోధన అందిస్తున్నాం.
–జయలక్ష్మి, సూపర్‌వైజర్, గడివేముల.

బలమైన పునాది వేస్తున్నాం

మూడు, నాలుగేళ్ల పిల్లలకు బొమ్మలు, ఆట పాటలతో బోధన చేస్తే సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. పాఠాలను పాటల రూపంలో చెప్పడంతో వారు అలవోకగా నేర్చుకునే అవకాశముంది. ఆ విధంగా వారికి విద్యలో బలమైన పునాది వేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు,
–బిడుదూరి రాములమ్మ, అంగన్‌వాడీటీచర్, గడివేముల

చేర్చారు. మండలంలో 49 అంగన్‌వాడీవాడీ కేంద్రాలు ఉండగా 48 మంది ఉపాధ్యాయులు, 48 మంది ఆయాలు ఉన్నారు. మొత్తం 895 మంది చిన్నారులు చదువుకుంటున్నారు.

సేవతోనే ఉద్యోగులకు గుర్తింపు



తహసీల్దార్ దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

కోడుమూరు రూరల్: విధి నిర్వహణలో ప్రజలకు చేసే సేవతోనే ప్రభుత్వ ఉద్యోగులకు పేరు ప్రఖ్యాతలు వస్తాయని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. కోడుమూరు తహసీల్దార్‌గా పనిచేస్తూ అన్నమయ్య జిల్లా రాయచోటికి బదిలీపై వెళుతున్న జయన్నను శనివారం కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, సీఐ మన్సూరుద్దీన్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమని, ఉద్యోగులంతా ప్రభుత్వం తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. తహసీల్దార్ జయన్న తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు, సకాలంలో పనులు పూర్తి చేసేవారన్నారు. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకునేవారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, ఈఓఆర్డీ మంజులు, సూపరింటెండెంట్ క్రిష్ణారెడ్డి, డీటీ రామాంజినేయులు, ఏఎస్‌ఓ రఘువీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



గూడూరు: తహసీల్దార్ వెంకటరమణను సత్కరిస్తున్న స్థానికులు

గూడూరు: స్థానిక తహసీల్దార్ వెంకటరమణకు సిబ్బంది, స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన వైఎస్సార్ జిల్లాకు బదిలీ కావడంతో శనివారం తన కార్యాలయంలో ఘనంగా వీడ్కోల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, మాజీ జెడ్పీటీసీ మెంబర్ ఎల్.వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తా

- కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్
- చనుగొండ్ల, వై.ఖానాపురంలో పర్యటన





చనుగొండ్లలో తాగునీటిని పరిశీలిస్తున్న ఆదిమూలపు సతీష్, చనుగొండ్లలో సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న సతీష్

గూడూరు రూరల్: వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో నెలకొన్న అన్నీ సమస్యలపై దృష్టిసారించి పరిష్కారం చూపుతామని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ అన్నారు. గూడూరు మండల పరిధిలోని వై.ఖానాపురం, చనుగొండ్ల గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. ముందుగా ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో టెంకాయలను కొట్టి ప్రత్యేక పూజలు జరిపి దర్శించుకున్నారు. చనుగొండ్లలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. వై.ఖానాపురంలోని ప్రధాన రహదారికి రోడ్డు, మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీని ఏర్పాటు చేయాలని, గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరుకు బీటీ రోడ్డు, తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వై.ఖానాపురంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, మూడు రోజుల్లో పనులను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే గూడూరు నుంచి కోడుమూరు వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు వారం రోజుల్లో భూమి పూజ చేసి ఎన్నికల అనంతరం పనులను పూర్తి చేస్తామని హామీనిచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనంతపురంలో చేపట్టనున్న సిద్ధం బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సిద్ధం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రంగయ్య, మాధవస్వామి, పాల దస్తగిరి, బడేసాహెబ్, మహమ్మద్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



గడివేముల సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీడీఓ

గడివేముల: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులకు వాటిపై పూర్తి హక్కులు కల్పించేందుకు చేపట్టిన పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మండల వ్యాప్తంగా చురుగ్గా సాగుతోందని ఎంపీడీఓ శివరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గడివేముల సచివాలయం–2లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారు పరిశీలించారు. త్వరితగతిన ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైందని తెలిపారు. 'నవరత్నాలు– అందరికీ ఇళ్లు' పథకం ద్వారా పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు చెప్పారు. స్థలాలపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాయుడు, సామన్న, పంచాయతీ కార్యదర్శులు తారకేశ్వరి, రంగడు తదితరలు పాల్గొన్నారు.

ఒక్క రోజే 246 రిజిస్ట్రేషన్లు

పాణ్యం: మండలంలో ఉచిత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం జరుగుతోంది. శనివారం ఒక్క రోజే



పాణ్యంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో 246 రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసినట్లు పాణ్యం సబ్‌రిజిస్ట్రార్ తేజోవతి తెలిపారు. ఈ నెల 2వ తేదీ 167 జరిగాయన్నారు. టెక్నికల్ సమస్యలుంటే తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా ఇళ్ల స్థలాలకు పూర్తి హక్కులు కల్పిస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆనందనం నెలకొంది.

చాలా సంతోషంగా ఉంది



నాకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేక మిన్నుకుండిపోయాం. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఓ రోజు గ్రామ వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. అధికారులు అన్ని అర్హతలు పరిశీలించి కొద్ది రోజుల్లోనే విలువైన ఇంటి స్థలం కేటాయించారు. ప్రస్తుతం ఇల్లు కట్టుకుంటున్నాం. వాటిపై సర్వహక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేసి, కన్వేన్స్ డీడ్ అందించడంతో రెట్టింపు సంతోషంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
–చండీప్రియ, గడివేముల

ఎంపీడీఓలు బాధ్యతల స్వీకారం

కోడుమూరు: కోడుమూరు ఎంపీడీఓగా దివ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్ అనంతపురం జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో కడప జిల్లాలో పని చేస్తున్న దివ్య కోడుమూరుకు వచ్చారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని దివ్య తెలిపారు.

ఓర్వకల్లు ఎంపీడీఓగా మల్లీశ్వరి



ఓర్వకల్లు: ఓర్వకల్లు ఎంపీడీఓగా బి.మల్లీశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివనాగప్రసాద్ అనంతపురం జిల్లా పామిడికి బదిలీపై వెళ్లిన విషయం విధితమే. ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి మండలంలో పనిచేసిన మల్లీశ్వరి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ తిప్పన్న, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

రూరల్ ఎంపీడీఓగా నరసింహనాయుడు

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ ఎంపీడీఓగా నరసింహనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అజాంఖాన్ ఇటీవలే గుండెపోటుతో మరణించారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా లేపాక్షి మండలంలో పనిచేస్తున్న నరసింహానాయుడును కర్నూలు రూరల్ ఎంపీడీఓగా నియమించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు ఎంపీడీఓగా జయశ్రీ



గూడూరు: అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

గూడూరు: ఎంపీడీఓగా పి.జయశ్రీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీగా పనిచేస్తున్న ఏసీ రాముడు ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు వెళ్లారు. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలంలో పనిచేస్తున్న జయశ్రీ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మండలం గురించి సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. ఏఓ విజయసింహరెడ్డి, ఈఓఆర్డీ మాధవీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా చౌదరి, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్ ఆమెకు అభినందనలు తెలిపారు.

పాణ్యం ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి



పాణ్యం: స్థానిక ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న దస్తగిరి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి భాగ్యలక్ష్మి పాణ్యంకు వచ్చారు. ఆమెను ఎంపీపీ ఉసేన్‌బీ, పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మాతా శిశు సేవల బలోపేతానికి చర్యలు

ఓర్వకల్లు: మాతా శిశు సేవలను బలోపేతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హెచ్ కొట్టాల అంగన్‌వాడీ కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. మాతా శిశు సేవలను బలోపేతం చేయడానికి 'కిల్కారి మెసేజ్ విధానాన్ని' ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విధానం వల్ల గర్భిణులకు 4 నెలల నుంచి కాన్పు తర్వాత ఏడాది వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు వారి గృహ సందర్శనాల్లో హెచ్‌బీఎన్‌సీ, హెచ్‌బీవైసీ విసిట్ చేసి వివరాలను ఈ–ఆశా యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. గర్భిణులు, 5 ఏళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలను వేయాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ అండ్ యూవిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం గర్భిణులకు టీడీ వాక్సిన్ వేయించి, వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఈ నెల 9వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా 1–19 ఏళ్ల వయస్సు గల పిల్లలు, కిశోరబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని పేర్కొన్నారు.



వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి

కోడుమూరు రూరల్: రబీ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులు ఈకేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు, రాయితీలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి అన్నారు. శనివారం కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి, వర్కూరు గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్‌తో కలిసి ఆమె పర్యటించారు. రబీ పంటల నమోదును క్రాస్ చెక్ చేశారు. వరలక్ష్మి మాట్లాడుతూ.. రబీ కింద రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవడంతో పాటు ఈనెల 10వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు, ఈకేవైసీ ఉంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, మందులు, విత్తనాలు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో బోర్ల కింద సాగు చేసిన కొర్ర ఇతర పంటలను పరిశీలించారు. వేరుశనగ దిగుబడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

డిజిటల్ విద్యదే భవిష్యత్తు

- ఎంఈఓ ఓంకార్, ఎంపీపీ తిప్పన్న
- విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ తిప్పన్న

ఓర్వకల్లు: సాంకేతికత నానాటికీ పెరుగుతున్న క్రమంలో గ్రామీణ పిల్లలు డిజిటల్ విద్యపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ తిప్పన్న అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. భవిష్యత్ తరాలకు డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓ ఓంకార్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ విద్యా విధానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఊరికి, తల్లితండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం ప్రాణేష్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ–1 ఫాతిమాబీ, సర్పంచ్ బ్రహ్మయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఉత్తమ ఫలితాలు



సి.బెళగల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

సి.బెళగల్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల విద్యుత్ ఏఈ సుకుమార్ అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ–పారిశ్రామిక సందర్శనలో భాగంగా సి.బెళగల్లోని విజయ కంప్యూటర్స్ సెంటర్‌లో కంప్యూటర్ పరికరాలు, పనిచేసే విధానం, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లపై కంప్యూటర్ శిక్షకుడు వీరేష్ వివరించారు. అదేవిధంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులకు విద్యుత్ సరఫరా, నిల్వ, జాగ్రత్తలపై ఏఈ సుకుమార్ వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు శివకృష్ణ, గిరిధర్, గౌడ్, నవీన్ తదితరులు ఉన్నారు.

మధ్యప్రదేశ్ వాసి మృతి

కర్నూలు: మండల పరిధిలోని నూతనపల్లె గ్రామ పొలిమేరలో కర్నూలు నగర డంప్ యార్డు సమీపంలో హిటాచి ప్రమాదంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం సత్న జిల్లా హిరాండి గ్రామానికి చెందిన ధర్మేంద్ర సత్నామి (27) మృతిచెందారు. కర్నూలు శివారులోని రింగ్ రోడ్డు నుంచి ఆత్మకూరు వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనుల కోసం కార్పొరేషన్ డంప్ యార్డు వద్ద కొండను తవ్వి మట్టిని రోడ్డుకు తరలిస్తున్నారు. దాదాపు 30 అడుగుల ఎత్తు గల కొండను హిటాచితో తవ్వుతుండగా శుక్రవారం రాత్రి కొండపై నుంచి మట్టి పెళ్లలు కూలింది. ఆపరేటర్ ధర్మేంద్ర మట్టిలో కూరుకుపోయాడు. సైట్ సూపర్‌వైజర్ బోయ నవీన్ గుర్తించి వెంటనే మట్టిని తొలగించి ధర్మేంద్రను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు మోహిత్ సత్నామి ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

రామలింగేశ్వర్ నగర్‌లో చోరీ

కర్నూలు: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వర్ నగర్‌లో శనివారం చోరీ జరిగింది. పుష్పలత అనే మహిళ గత నెల 25న బంధువులను చూసేందుకు హైదరాబాద్ వెళ్లింది. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దొంగలు తాళం పగులగొట్టి 5 తులాల బంగారం, రూ.9 వేల నగదు, వెండి అపహరించారు. స్థానికుల సమాచారంతో ఇంటికి చేరుకుని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.